
సాక్షి
వరంగల్

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



విద్యార్థుల సంఖ్యను పెంచాలి
పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని నోడల్ ఆఫీసర్ సుజన్‌తేజ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం పలు పాఠశాలల రికార్డులను పరిశీలించారు. - 9లో ▸



సంతలో సౌకర్యాలు కరువు
నల్లబెల్లి మండల కేంద్రంలోని సంతలో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. - 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
$41.5^0/25^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వేడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగి వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
బుధ 6:38	గురు 4:32

రంజాన్ వేళలు







కళాకారుల నృత్యప్రదర్శన, వేదికపై మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు సీతక్క, వినయ్‌భాస్కర్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు





రామప్ప.. మురిసె

ఘనంగా ప్రపంచ వారసత్వ వేడుకలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉర్రూతలూగించిన ఎస్ఎస్ తమన్ సంగీత విభావరి
- ముఖ్య అతిథులుగా మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్

ప్రపంచ వారసత్వ వేడుకల నిర్వహణతో రామప్ప మురిసిపోయింది. విద్యుత్‌వెలుగుల నడుమ నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమ ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామప్ప ఆలయ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా బలగం సినిమా కళాకారులను సత్కరించారు. కాగా, సాయంత్రం 5గంటలకు ప్రారంభం కావాల్సిన సాంస్కృతిక కార్యక్రమాలు 6:12 గంటలకు ప్రారంభమయ్యాయి. నాయకుల ప్రసంగాలు, సన్మానాలు ముగిసేసరికి ఆలస్యం కావడంతో సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు వచ్చిన వారు కొంత అసహనం వ్యక్తం చేశారు.

- వివరాలు 8లో ▸ - ములుగు/వెంకటాపురం(ఎం)

ఆకట్టుకోని ఫుడ్ ఫెస్టివల్
కనీస వసతులు కల్పించలేదని స్టాల్ నిర్వాహకుల ఆగ్రహం

ప్రొటోకాల్ వివాదం..
వెనుదిరిగి వెళ్లిన ఎమ్మెల్యే పొదెం వీరయ్య - 8లో ▸

న్యూస్‌రీల్

నగదు బదిలీ చేయాలి



నర్సంపేట: గొర్రెలకు బదులు నగదు బదిలీ ద్వారా పథకం అమలు చేసి అవినీతికి అవకాశం లేకుండా చూడాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య, జిల్లా కార్యదర్శి పరికి మధుకర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల పంపిణీ చేసిన యాదవ, కురమ యువతకు గొర్రెల బదులు ఇతర యూనిట్ల కొనుగోలుకు అవకాశం కల్పించాలని కోరారు. జిల్లాలో మొదటి విడత 10,470 మందికి బదులు 10,189 మంది లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ జరిగిందన్నారు. రెండో విడత బి లిస్టులో 12,782 మంది లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే గొర్రెల పంపిణీలో అవినీతికి తావు లేకుండా అమలు చేస్తామని, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కుండె లింగస్వామి, ఖానాపురం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాసా ప్రవీణ్‌కుమార్‌యాదవ్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు బొడ్డు రవి, జక్కుల మల్లేష్, నాంచారి కుమారస్వామి, జక్క రవి, మజ్జిగ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు

వర్ధన్నపేట: పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన దివ్యాంగుల సదరం శిబిరం విజయవంతమైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహస్వామి తెలిపారు. ఈ శిబిరానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 95 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకోగా 75 మంది పాల్గొన్నట్లు తెలిపారు. వీరికి వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అర్హులైన దివ్యాంగులు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ పెన్షన్ విభాగం అధికారులు పేర్కొన్నారు. ఈ సదరం శిబిరంలో డాక్టర్లు చందు నాయక్, నరసింహా రెడ్డి, వేణు, రాము నాయక్, వీరయ్య, డీఆర్‌డీఏ సదరం విభాగం అధికారులు కిరణ్, శైలజ పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు అందజేత



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంకు చెందిన కొట్టె శ్రవణ్‌కుమార్‌కు దళితరత్న అవార్డును ప్రదానం చేశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈదునూరి యాకయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మర్మముల్ల మల్లేశ్‌లు ఈ అవార్డును శ్రవణ్‌కుమార్‌కు అందించి శాలువా, మెమొంటోతో సన్మానించారు.

కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలి



వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆనుకుని జరుగుతున్న కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈఓ వాసంతి తెలిపారు. మంగళవారం కేజీబీవీ పాఠశాలను సందర్శించి మాట్లాడుతూ నూతనంగా నిర్మించే కాల్వ పనులు వర్షాకాలంలోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాలని కోరారు. అందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరించాలని తెలిపారు. కాగా పాఠశాల ప్రాంగణంలోని కొంత స్థలాన్ని కాల్వ నిర్మాణానికి కేటాయించాలని ప్రజాప్రతినిధులు డీఈఓను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోడిశాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ మడ్డి రాజ్‌కుమార్, వార్డు సభ్యుడు నాగరాజు, కవి రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే కేసులు



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హన్మకొండ: బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కేసులు తప్పవని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం హనుమకొండ స్నేహనగర్‌లో బాలల పరిరక్షణ కమిటీ విధి విధానాలపై హనుమకొండ వరంగల్ జిల్లాల మండల పరిషత్ అధ్యక్షులు, గ్రామ సర్పంచులకు ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న సాకులతో, ఆర్థిక లేమి కారణంతో ముక్కు పచ్చలారని పిల్లలకు పెళ్లిళ్లు చేసి వారి భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడవద్దన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో కమిటీలు క్రియాశీలకంగా, బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ కర దీపికను ఆవిష్కరించారు.

తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో సభ్యురాలు శోభారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్‌లు జి సంధ్యారాణి, అశ్విని తానాజీ వాకడే, డీఆర్డీఓలు ఆకవరం శ్రీనివాస కుమార్, సంపత్ రావు, డీపీఓ వి.జగదీశ్వర్, ఆర్జేడీ బి.ఝాన్సీ లక్ష్మీబాయి, జిల్లా సంక్షేమ అధికారులు ఎం.సబిత, ఎం.శారద, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ శిరీష, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ కె.వసుధ, రెండు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మత్తడి రోడ్డు పరిశీలన



మత్తడిని పరిశీలిస్తున్న సంజీవరావు

సంగెం: మండలంలోని ఎల్గూర్‌రంగంపేట చెరువు మత్తడి రోడ్డుపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలనే వినతి మేరకు మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ సంజీవరావు మత్తడి రోడ్డు, మత్తడిని సందర్శించి పరిశీలించారు. సుమారు 20 గ్రామాల ప్రజలు, రైతులు వానాకాలంలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై శాశ్వత పరిష్కారం కోసం ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని రైతులు కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే ధర్మారెడ్డి, ఉన్నతాధికారులతో సమీక్షించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, డీఈ జ్ఞానేశ్వర్, ఏఈ రమేష్, నాయకులు ఇజ్జగిరి అశోక్, కోదూరి రమేష్, పెండ్లి పురుషోత్తం, ప్రతాప్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ నియామకం అక్రమం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

గీసుకొండ: ఐనవోలు దేవాలయ నూతన కమిటీని కోర్టు పరిధిలో వివాదం ఉండగా ఎమ్మెల్యే అరూరి రమేశ్ అక్రమంగా ఏర్పాటు చేయించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ఆరోపించారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ నగరం ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన తమ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేవస్థానం నిధులను కాజేయడానికి, ఆలయ పనులకు సంబంధించిన వ్యక్తులకు కమీషన్ల కోసం కొత్త కార్యవర్గాన్ని హడావిడిగా నియమించారన్నారు. కమిటీ నియామకానికి సంబంధించిన దేవాదాయశాఖ ఉత్తర్వుల కాపీని ఇవ్వమని ఆ శాఖ అధికారులను కోరితే వారు ఇవ్వడం కుదరదని చెప్పారన్నారు. నియామక ఉత్తర్వులు లేకుండానే దేవాదాయశాఖ అధికారులు, ఎమ్మెల్యే రమేశ్ ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల నియామకం చేపట్టడం అన్యాయమన్నారు. ఈ వ్యవహారంపై తాము న్యాయస్థానానికి వెళ్తామన్నారు. జిల్లా అధికార ప్రతినిధి గట్టికొప్పుల రాంబాబు, కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతికుమార్, 16వ డివిజన్ అధ్యక్షుడు గోదాసి అశ్విని పాల్గొన్నారు.

ముగిసిన భూసేకరణ అవార్డు విచారణ



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

నెక్కొండ: మూడు రోజులుగా వివిధ గ్రామాల రైతులతో జరిపిన నాగపూర్- విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణ అవార్డు విచారణ కార్యక్రమం ముగిసింది. మండలంలోని తోపనపల్లి, వెంకటాపురం గ్రామాల రైతులతో నెక్కొండ రైతు వేదికలో మంగళవారం నర్సంపేట ఆర్డీఓ శ్రీనివాసులు అధ్యక్షతన జాతీయ రహదారుల సంస్థ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణ అవార్డు విచారణ కార్యక్రమం జరిగింది. అధికారులు.. రైతులతో జరిపిన విచారణ నివేదికను కలెక్టర్, జాతీయ రహదారుల రిజినల్‌కు నివేదిస్తామని ఆర్డీఓ తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించి భూ వివరాలు సర్వే రికార్డుల ప్రకారం జాబితాలో సరిగా లేవని రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రీ సర్వే చేయడంతోపాటు విలువైన భూములు కోల్పోతున్న రైతులకు పరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు, అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే నిర్మాణ పనులు చేపట్టాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీఎస్. వెంకన్న, వెంకటాపురం, తోపనపల్లి గ్రామాల సర్పంచ్‌లు కుమార్, ఫకీర్ మియా, ఆర్‌ఐ నరేందర్, గ్రీన్‌ఫీల్డ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో ‘అవిశ్వాసం’!

ఒక్కొక్కటిగా బయటపడుతున్న అసంతృప్తి
- తాజాగా భూపాలపల్లి చైర్మన్, వైస్ చైర్మన్‌లపై నోటీసు
- జనగామ పాలకవర్గంపై కొనసాగుతున్న సస్పెన్స్
- ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలకు ‘అవిశ్వాసం’తలనొప్పి
- మరో రెండు మున్సిపాలిటీలలో మొదలైన అసంతృప్తి?



భూపాలపల్లిలో సమావేశమైన కౌన్సిలర్లు

సాక్షిప్రతినిధి, వరంగల్: మున్సిపాలిటీల్లో అవిశ్వాస రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. ఒకరిని చూసి ఒకరు కావొచ్చు.. చైర్మన్, వైస్ చైర్మన్‌లపై ఆగ్రహం కావొచ్చు.. ‘మాకెప్పుడు అవకాశం’అన్న ఆలోచన.. ఇలా కారణాలేమైనా అధికారంలో ఉన్న సభ్యులే అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశం అవుతోంది. నివురుగప్పిన నిప్పుల ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా అవిశ్వాసం రూపంలో బయటకు వస్తుండడం స్థానిక ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులకు తలనొప్పిలా మారుతోంది. ఉమ్మడి వరంగల్‌లో మొదటగా జనగామ మున్సిపల్ కౌన్సిలర్లు .. చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్‌లపై అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. ఆ గొడవంతా ఇప్పుడిప్పుడే కొలిక్కి వస్తున్న తరుణంలో భూపాలపల్లి మున్సిపాలిటీలో అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్ వెంకటరాణి, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం బీఆర్ఎస్‌లో కలకలం రేపుతోంది.

జనగామలో మొదలై.. భూపాలపల్లి వరకు...
ఉమ్మడి వరంగల్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాకుండా 9 మున్సిపాలిటీలు ఉన్నాయి. జనగామ మున్సిపాలిటీ నుంచి మొదలైన అవిశ్వాసం పొగ భూపాలపల్లి వరకు పాకింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, ఫ్లోర్‌లీడర్ పాండులపై అవిశ్వాస నోటీసులను అందించారు. ఆ ముగ్గురిని తప్పించడం కోసం 11 మంది బీఆర్ఎస్, 8 మంది కాంగ్రెస్ సభ్యులు కలిపి మొత్తం 19 మంది యశ్వంతాపూర్ రేణుక ఎల్లమ్మ గుడి అవిశ్వాస పత్రాలపై సంతకాలు చేసి జనవరి 25న లేఖను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కు అందించి క్యాంపులకు వెళ్లారు. బల నిరూపణకు ఎటువంటి తేదీలు ప్రకటించలేదు. ఒకరోజు తర్వాత జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఫోన్‌లో బుజ్జగించే ప్రయత్నం చేయగా ఎవరూ వినలేదు. ఇదే సమయంలో పాలకవర్గం కోర్టుకు వెళ్లి స్టే తీసుకోగా, అసంతృప్తికి కారణమైన ఫ్లోర్ లీడర్ మారబోయిన పాండును ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి తప్పించారు. దీంతో అంతా సద్దుమణిగిపోయిందని భావిస్తున్న తరుణంలో బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీలో అధికార పార్టీకి చెందిన 20 మంది కౌన్సిలర్లు చైర్మన్ వెంకటరాణి సిద్ధూ, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌లపై అవిశ్వాస తీర్మానం జిల్లా లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్ దివాకర్‌కు అందజేయడం అధికార పార్టీకి మరో షాక్‌లా అందరూ భావిస్తున్నారు.

ఒంటెత్తుపోకడలే కారణమా..
రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ రూ.కోట్లల్లో నిధులు వెచ్చిస్తోంది. స్థానిక ఎమ్మెల్యేలు, నేతల కనుసన్నల్లో పాలకవర్గాలు ఆ నిధులు సద్వినియోగం చేయాల్సి ఉంది. కొందరు చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు అధికారదర్పం, ఒంటెత్తుపోకడలను సహచర కౌన్సిలర్లు జీర్ణించుకోవడం లేదు. ఫలితంగా పెరుగుతున్న అసంతృప్తి అవిశ్వాసం వైపు తీసుకెళ్లుండగా, ఎమ్మెల్యేలు బుజ్జగింపులు సైతం ఫలితాలు ఇవ్వడం లేదు. వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని మరో రెండు మున్సిపాలిటీల్లోనూ అసంతృప్తి చాపకిందనీరులా మారినట్లు సమాచారం. కాగా భూపాలపల్లిలో అవిశ్వాసం నోటీసుతో పాటు బీఆర్ఎస్ పార్టీ అర్బన్ ఉపాధ్యక్షుడు, హనుమాన్ టెంపుల్ డైరెక్టర్‌తో పాటు ముగ్గురు కలిసి ఇదే రోజు రాజీనామా చేయడంతో బీఆర్ఎస్‌లో ముసలం మొదలైందన్న చర్చ జరుగుతోంది.

జస్టిస్ అభిషేక్‌రెడ్డిని కలిసిన బార్ అసోసియేషన్ల నేతలు



జస్టిస్ అభిషేక్‌రెడ్డికి పూలమొక్కను అందజేస్తున్న వరంగల్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు



విజ్ఞాపన పత్రం అందజేస్తున్న హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్ లీగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల పరిపాలన న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్ రెడ్డిని నూతనంగా ఎన్నికైన ఉభయ జిల్లాల బార్ అసోసియేషన్ నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్జి అభిషేక్‌రెడ్డికి పూలమొక్క, పుష్పగుచ్ఛాలు, విజ్ఞాన పత్రాలను వేర్వేరుగా అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల స్థానాలను భర్తీ చేయాలని, వరంగల్ జిల్లా కోర్టు తరలింపు స్థల కేటాయింపునకు నిర్ణయం తీసుకోవాలని, హనుమకొండ జిల్లాకు ఏసీపీ కోర్టు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జడ్జిని కలిసిన వారిలో రెండు బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్యాంసుందర్‌రెడ్డి, ఏ ఆనంద్ మోహన్, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ పసుల యాకస్వామి, దయాన్, అమృత్‌రావు, అండాలు, సీహెచ్ శ్రీనివాస్, టి.శ్రీనివాస్ ఉన్నారు.

ఏజీపీగా బాధ్యతల స్వీకరణ

వరంగల్ లీగల్: హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు, భూ సంస్కరణల అప్పిలేట్ ట్రిబ్యునల్ సహాయక ప్రభుత్వ న్యాయవాదిగా సీహెచ్ కుమారస్వామి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జయలక్ష్మిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

మహిళా సాధికారతకు కృషి

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట: రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ మహిళా సాధికారతకు కృషి చేస్తూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్టు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చారని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని చెన్నారావుపేట, నర్సంపేట, ఖానాపురం మండలాలకు చెందిన అర్హులైన 67 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ మహిళలకు మంగళవారం రూ.67 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం నిరుపేదలకు ఆర్థిక వెసులుబాటును కల్పించిందన్నారు. వివాహం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత డాక్యుమెంట్స్‌ను జతపరిచి మీసేవా ద్వారా కల్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు సహకరించి వారు దరఖాస్తు చేసుకునే విధంగా సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు, తహసీల్దార్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కులు రాలేదని అన్నదాతల ఆగ్రహం
దుగ్గొండి: గత సంవత్సరం జనవరిలో కురిసిన వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంట పరిహారం చెక్కులు రాలేదని రైతులు వాపోయారు. మంగళవారం మల్లంపల్లిలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొనగా వివిధ గ్రామాలకు చెందిన రైతులు తమ గోడును విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న వ్యవసాయ శాఖ ఏఓ దయాకర్, ఏఈఓ రాజేశ్, హెచ్ఓ జ్యోతిలను ప్రశ్నించారు. ఏఈఓ సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు రైతులతో సమావేశమై వాస్తవ నివేదిక ఇవ్వాలని సూచించారు. అనంతరం 4,075 ఎకరాలు నష్టపోయిన 2,754 మంది రైతులకు రూ. 2.27 కోట్ల విలువ గల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల, తోకల నర్సింహారెడ్డి, సుకినె రాజేశ్వర్‌రావు, మహిపాల్, షైడి, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీఓ క్రిష్ణప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కేయూ ఎల్ఎల్ఎం సెమిస్టర్ల పరీక్షల షెడ్యూల్ విడుదల



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్ఎం ఒకటి, మూడవ సెమిస్టర్ల పరీక్షల షెడ్యూల్‌ను పరీక్షల విభాగం అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఎల్ఎల్ఎం ఎల్ఎల్ఎం మూడవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 27, 29 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరుగుతాయి. ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26, 28, మే 1వతే దీన ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతాయని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు.

గురుకులంలో కరోనా కలకలం

- 8 మందికి పాజిటివ్



గురుకులంలో ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్

తొర్రూరు: పట్టణంలోని సంక్షేమ బాలికల గురుకులంలో కరోనా కలకలం రేపింది. పాఠశాలలో మొత్తం 8 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. జ్వరంతో ఉన్న విద్యార్థులను సోమవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి కరోనా పరీక్షలు చేయించగా అందులో ఒకరికి పాజిటివ్‌గా తేలింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది మంగళవారం పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో మొత్తం 172 మంది విద్యార్థులు, 39 మంది బోధన, బోధనేతర సిబ్బందికి ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. వీరిలో 8 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది. పాజిటివ్ వచ్చిన విద్యార్థులను ఇళ్లకు పంపించినట్లు ప్రిన్సిపాల్ జయశ్రీ తెలిపారు.

డీఎంహెచ్‌ఓ సందర్శన

గురుకులంలో 8 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా తేలిన నేపథ్యంలో పాఠశాలను డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ సందర్శించారు. కరోనా బారిన పడడానికి దారితీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ సహకారంతో పాఠశాల పరిసరాలు శానిటైజ్ చేయాలని, విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆయన సూచించారు. కోవిడ్ లక్షణాలు ఉన్నవారు వైద్యుల సూచన మేరకు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గుండాల మురళీధర్, వైద్యులు ప్రియాంక, శృతి, సిబ్బంది పాల్గొన్నారు.

టైరు పేలి.. పల్టీకొట్టిన కారు

- తప్పిన పెనుప్రమాదం

గూడూరు: కంకర తేలి గుంతలుగా ఉన్న రోడ్డుపై వెళ్తున్న ఓ కారు టైరు పేలడంతో ప్రమాదవశాత్తు పల్టీకొట్టగా అందులో ప్రయాణిస్తున్న వారికి పెను ప్రమాదం తప్పిన సంఘటన మంగళవారం బొద్దుగొండ వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు నుంచి మహబూబాబాద్ వరకు నేషనల్ హైవే రోడ్డు పనులు మధ్యంతరంగా నిలిచిపోయాయి. దీంతో బొద్దుగొండ వద్ద గల హైటెన్షన్ విద్యుత్ తీగలతో కిలోమీటరు పొడవునా ఎన్‌హెచ్ పనులు నిలిచిపోయాయి. దీంతో రోడ్డంతా కంకరతేలి, గుంతలుగా మారింది. ఈ క్రమంలోనే ఇల్లందు నుంచి వరంగల్ వెళ్తున్న ఓ కారు టైర్ ఒక్కసారిగా ఆ ప్రాంతంలో పేలింది. భారీ శబ్ధంతో ప్రమాదవశాత్తు ఎన్‌హెచ్ రోడ్డుపై నుంచి కిందకు మొక్కజొన్న చేను వైపునకు వెళ్లింది. దీంతో పెనుప్రమాదం తప్పింది. కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా వెంటనే వారిని మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

బలగం సినిమా కళాకారులను సన్మానిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, తదితరులు





రామప్ప మురిసె..

ఘనంగా ప్రపంచ వారసత్వ వేడుకలు

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉర్రూతలూగించిన ఎస్‌ఎస్ తమన్ సంగీత విభావరి
- అలరించిన శివమణి డ్రమ్స్, కార్తీక్ గానం





మాట్లాడుతున్న మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్



వారసత్వ వేడుకలకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు



కళాప్రదర్శన


ములుగు/వెంకటాపురం(ఎం): అంగరంగ వైభవంగా ప్రపంచ వారసత్వ వేడుకల సంబురం మంగళవారం రాత్రి ముగిసింది. సాయంత్రం 6:12 గంటలకు ప్రారంభమైన ఉత్సవాలు అంబరాన్నంటాయి. కళాకారుల నృత్యాలు, పాటలతో రామప్ప ఆలయం మారుమ్రోగింది. ఉత్సవాలకు 15 వేల నుంచి 20 వేల మంది ప్రజలు హాజరవుతారని అధికారులు భావించినప్పటికీ సుమారు 5 వేల మంది మాత్రమే హాజరు కావడంతో గార్డెన్‌లో వేసిన కుర్చీలు వెలవెలబోయాయి. 6:12 గంటలకు కొలువై ఉన్నాడే దేవదేవుడు అనే పాటకు కళాకారిణి అనిశ్రితరెడ్డి చేసిన నాట్యం పలువురిని అలరించింది. ములుగుకు చెందిన గోల్కొండ బుచ్చన్న బృందం అమ్మపాటను ఆలపించింది. పేరిణి రాజ్‌కుమార్ బృందం పరమశివుడిపై పేరిణి నృత్య ప్రదర్శన చేశారు. రామప్ప డాక్యుమెంటరీ వీడియోను ప్రదర్శించారు. అనంతరం మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌ను వేదికపైకి పిలువగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ కళానైపుణ్యాన్ని, తరతరాల చరిత్రను, రామప్ప ఆలయ చరిత్ర, కళను ప్రపంచానికి చాటి చెప్పడమే కాకుండా రాబోయే తరాలకు అందించాలన్నారు. ములుగు జిల్లాలోనే పర్యాటక ప్రదేశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..కేసీఆర్ పట్టుదలతోనే రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించిందన్నారు. అనంతరం బలగం దర్శకుడు వేణుతో పాటు సినిమా నటీనటులను మంత్రులు సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాష్‌రావు, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క, ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, జెడ్పీ చైర్మన్లు కుసుమ జగదీష్, గండ్ర జ్యోతి, రెడ్‌కో చైర్మన్ సతీష్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి, వైవీ గణేష్, ఎస్పీ గాష్ ఆలం, ఓఎస్‌డీ అశోక్‌కుమార్, ఆర్డీఓ రమాదేవి, జెడ్పీ వైస్ చైర్మన్ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎస్‌ఎస్ తమన్, శివమణి

ప్రపంచ వారసత్వ ఉత్సవాల్లో ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్‌ఎస్ తమన్, ప్రముఖ వాయిద్య కళాకారుడు శివమణి, సింగర్ కార్తీక్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సుమారు గంట ఇరవై నిమిషాల పాటు సంగీత ప్రదర్శన, డ్రమ్స్ సౌండ్స్‌తో సభాప్రాంగణం దద్దరిల్లింది. సింగర్ కార్తీక్ పాటలు పాడి ప్రజలను ఉత్తేజపర్చారు. శ్రావ్యమానస డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సుమారు 200 మంది కళాకారులు అరగంట పాటు చేసిన క్లాసికల్, ఫోక్ నృత్య ప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్నాయి.

వెలవెలబోయిన సభాప్రాంగణం

వారసత్వ ఉత్సవాల వేడుకలకు సుమారు 15 నుంచి 20 వేల మంది ప్రజలు హాజరవుతారని భావించినప్పటికీ ప్రజలు ఉత్సవాలపై ఆసక్తి చూపలేదు. రామప్ప ఆలయం ఎదుట నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌కు కూడా ప్రజల నుంచి ఆదరణ లభించలేదు. ఉత్సవాలకు ప్రజలు రాకపోవడంతో గార్డెన్‌లో వేసిన కుర్చీలు వెలవెలబోయాయి. ఉత్సవాల సందర్భంగా పలుచోట్ల పోలీసులు అత్యుత్సాహం చూపి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. మీడియా ప్రతినిధులను సైతం సభావేదిక వద్దకు అనుమతించలేదు. మీడియా పాస్‌లు ఉన్నప్పటికీ అక్రిడేషన్ కార్డు చూపెడితేనే మీడియా గ్యాలరీలోకి అనుమతించినప్పటికీ సభావేదిక దూరంగా ఉండడంతో ప్రతినిధులు ఇబ్బందులకు గురయ్యారు.



స్వాగత నృత్యం చేస్తున్న కళాకారిణి



సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు



సంగీత విభావరిలో తమన్, గాయకులు



డ్రమ్స్ వాయిస్తున్న శివమణి

ప్రొటోకాల్ వివాదం..

- వెనుదిరిగి వెళ్లిన ఎమ్మెల్యే పొదెం వీరయ్య
- వేదికపైకి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడంపై ఆగ్రహం



సభా వేదిక నుంచి వెనుతిరుగుతున్న భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

ములుగు/వెంకటాపురం(ఎం): రామప్పలో జరిగిన వారసత్వ ఉత్సవాల్లో ప్రొటోకాల్ వివాదం చోటుచేసుకుంది. సభావేదికపైకి మంత్రులను, ఇతర ఎమ్మెల్యేలను, కార్పొరేషన్, జెడ్పీ చైర్మన్లను, వేదికపైకి ఆహ్వానించి సకాలంలో తనను పిలువలేదనే నెపంతో రామప్ప నుంచి హనుమకొండకు భద్రాచలం ఎమ్మెల్యే వీరయ్య వెనుదిరిగి వెళ్లిపోయారు. మంత్రులు రాకముందే రామప్పకు చేరుకున్న వీరయ్యను మంత్రులు వచ్చిన తర్వాత ప్రొటోకాల్ ప్రకారం వేదికపైకి పిలువకుండా నామినేటెడ్ పోస్టులు ఉన్న వారిని తనకంటే ముందు పిలువడంతో అసంతృప్తికి గురైనట్లు సమాచారం.

ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానిక ప్రజాప్రతినిధులు

ప్రపంచ వారసత్వ ఉత్సవాల్లో వేదికపైకి మంత్రులను, ఎమ్మెల్యేలను, చైర్మన్‌లను, అధికారులను ఆహ్వానించినప్పటికీ స్థానిక సర్పంచ్ డోలి రజిత, ఎంపీపీ బుర్ర రజిత, జెడ్పీటీసీ రుద్రమదేవిలను వేదికపైకి ఆహ్వానించలేదు. దీంతో వారు వేదిక ముందే తమను అవమానపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు. చేసిన తప్పును తెలుసుకున్న అధికారులు ప్రజాప్రతినిధులను తర్వాత పిలిచినప్పటికీ వేదికపైకి వెళ్లలేదు. గతంలో రామప్ప పర్యటనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చిన సమయంలో అధికారులు తమను వేదికపైకి ఆహ్వానించకుండా అవమానపరిచారని సర్పంచ్ రజిత రాష్ట్రపతి కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన రాష్ట్రపతి కార్యాలయం విచారణ చేయాల్సిందిగా సీఎంఓ కార్యాలయాన్ని ఆదేశించింది. రామప్పలో కార్యక్రమాలు జరిగినపుడల్లా తమను వేదికపైకి పిలువకుండా అధికారులు అవమానపరుస్తున్నారని, మహిళా ప్రజాప్రతినిధులుగా ఉండడమే తమ శాపమా అని ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

‘ఫుడ్ ఫెస్టివల్’కు ఆదరణ కరువు

- స్టాల్ నిర్వాహకుల్లో అసంతృప్తి
- రామప్ప ఆలయం ఎదుట40 స్టాల్స్ ఏర్పాటు
- కనీస వసతులు లేవని నిర్వాహకుల ఆగ్రహం



రామప్ప ఆలయం ముందు వెలవెలబోయిన స్టాల్స్



టేబుళ్లు లేకపోవడంతో కంజీవర్ పెయింట్స్‌ను ప్రదర్శన చేయని రంజిని విశాల్

వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ ఉత్సవాల్లో భాగంగా రామప్ప ఆలయం ఎదుట నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆదరణ కరువైంది. వేలాది రూపాయలు వెచ్చించి రామప్పకు వచ్చి స్టాల్స్ ఏర్పాటు చేస్తే కనీస వసతులు కల్పించలేదని నిర్వహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయం ఎదుట 40 స్టాల్స్‌ను వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ఈవెంట్ ఆర్గనైజర్‌కు సంబంధించి గురు ప్రొడక్షన్ వారు ఆహ్వానిస్తే హైదరాబాద్‌కు చెందిన గోల్డెన్ ఉమెన్స్ క్లబ్ నుంచి 13 మంది స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు రామప్పకు వచ్చారు. ఉదయం 10 గంటలకు వస్తే కేవలం టెంట్ మాత్రమే వేసి ఇచ్చారన్నారు. కనీసం టేబుళ్లు కూడా ఇవ్వకపోతే తాము తీసుకొచ్చిన వస్తువులను ఎలా ప్రదర్శించాలని విచారం వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో ఫుడ్ ఐటమ్స్ తీసుకొచ్చామని కానీ విక్రయించే అవకాశాలు తమకు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో వచ్చి నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు.

వసతులు కల్పించలేదు



ఈవెంట్ ఆర్గనైజర్ సూచన మేరకు గురుప్రొడక్షన్ వారు ఆహ్వానిస్తేనే రామప్ప ఫుడ్ ఫెస్టివల్‌కు వచ్చాం. ఉదయం 10 గంటలకు రామప్పకు వస్తే స్టాల్స్ ఏర్పాటులో సౌకర్యాలు కల్పించలేదు. టెంట్ మాత్రమే వేసి నిర్వాహకులు చేతులు దులుపుకున్నారు. హైదరాబాద్ నుంచి 13 స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు వస్తే 4 స్టాల్స్ మాత్రమే కేటాయించి సౌకర్యాలు మాత్రం కల్పించలేదు.

– ఉమా పేరి, గోల్డెన్ ఉమెన్స్ క్లబ్ ఫౌండర్, హైదరాబాద్

ఆర్డర్ లేకుండా ‘ఐనవోలు’ ప్రమాణ స్వీకారం?



ప్రమాణ స్వీకారం చేస్తున్న మల్లికార్జున స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు (ఫైల్)

- నిబంధనలకు తిలోదకాలు ఇచ్చిన ఎండోమెంట్ అధికారులు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో నూతనంగా 14 మంది ధర్మకర్తల మండలి సభ్యులను ఎండోమెంట్ డివిజినల్ పరిశీలకులు సంజీవరెడ్డి సోమవారం పదవీ, గోప్యత ప్రమాణ స్వీకారం చేయించిన విషయం తెలిసిందే. ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఉత్తర్వుల ప్రతిని ఇవ్వాలని సంజీవరెడ్డిని, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావులను కోరగా ఉత్తర్వుల కోసం ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)ను అడగాలని దాటవేత ధోరణి ప్రదర్శించారు. ఉత్తర్వుల ప్రతి కోసం ఏసీకి ఫోన్ చేయగా ఆమె అందుబాటులోకి రాలేదు. అసలు ఉత్తర్వులు లేకుండానే నిబంధనలకు తిలోదకాలిచ్చి ఎండోమెంట్ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారా..? అన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.

జనవరి 10 ఉత్తర్వులు చెల్లుబాటు అవుతాయా?

జనవరి 10న జీఓ నంబర్ 11 ఉత్తర్వులు వెలువడగా 30 రోజుల లోపు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. అలా చేయలేకపోతే సాంకేతికంగా చెల్లుబాటు కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటి సందర్భంలో ఎండోమెంట్ నిబంధనల ప్రకారం ధర్మకర్తల మండలి నియామకానికి కొత్తగా ఆర్డర్ ఇవ్వాలని లేదా నోటిఫికేషన్ ఇచ్చి మళ్లీ ప్రక్రియను ప్రారంభించి ఉండాల్సిందనే వాదన కూడా వినిపిస్తోంది. ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారానికి కొత్తగా ఉత్తర్వులు ఇచ్చారా? లేదా పాత ఉత్తర్వుల ఆధారంగానే ప్రమాణ స్వీకారం చేయించారా అన్న విషయం ఎండోమెంట్ ఉన్నతాధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పాత ఉత్తర్వుల ఆధారంగా ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పిటిషనర్ మరోసారి కోర్టును ఆశ్రయిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. సాంకేతిక అంశాల కారణంగా అధికారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అసలు ఏం జరిగింది..

ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి జనవరి 10న ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఎండోమెంట్ కమిషనర్ జీఓ నంబర్ 11ను జారీచేశారు. ఈ జీఓను రద్దుచేయాలని కోరుతూ పైల శ్రీనివాసులు అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా జీఓ నంబర్ 11ను తాత్కాలికంగా నిలిపి వేస్తూ జనవరి 11న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 12న ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం జరగాల్సి ఉండగా హైకోర్టు ఆదేశాలు ఉండగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని ఎండోమెంట్ అధికారులు వాయిదా వేశారు. తదుపరి ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం మార్చి 31న పైల శ్రీనివాసులు పిటిషన్‌ను కొట్టివేసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

JAI BHARATH STUDY HALL

■ జై భారత్ స్టడీ హాల్ కాజీపేటలో ప్రారంభం పోటీ పరీక్షలు & అనేక రకాల ప్రవేశ పరీక్షల కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థులు ఉద్యోగ అభ్యర్థుల కోసం సంప్ర॥ HP పెట్రోల్ పంప్ ప్రక్కన, బాపూజీనగర్, కాజీపేట. 8690869052 [W-785488]

REAL ESTATE

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26935]

HOUSE FOR SALE

■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26936]

■ వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26937]

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26938]

PLOT FOR SALE

■ వరంగల్ చింతల్‌లో ఉత్తరం ఫేస్‌గల 285 గజాల ఓపెన్ ప్లాట్ అమ్మబడును. వివరాలకు వెంటనే సంప్రదించండి. సెల్: 6300185339 [W-785486]

SERVICES

LOANS

■ సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785485]

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-785473]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-785478]

WANTED

■ Wanted Female telecallers for Leading a Banking Channel Salary 10K. Q: Any Degree, Direct Job Not a Consultant No Fee. Cont: 7396195324. [WA-5364]

■ TSRTC WGL-1 డిపో యందు అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయుటకు బస్ వాషింగ్ & క్లీనింగ్ & Parking డ్రైవర్స్, వాటర్ కాటన్స్ లోడింగ్ కొరకు కావలెను. Age: 18-55, Cont: 9640721125. [W-785489]

■ Kamalatmika Poultry is Looking for the following positions 1) Chicken Cutters 2) Dressing People 3) Sales Executives. Exp. is mandatory in the same domain. Attractive Salary & Bonus. Cell: 8106112401. [W-785482]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793416]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 9000408325 [G-785738]

■ ప్రముఖ ఆఫీస్ నందు పనిచేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. Qua: ఇంటర్, అడ్రస్: రంగశాయిపేట సర్కిల్, వరంగల్. సెల్: 9966984120, 7386788281. [W-785481]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785739]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ హన్మకొండ, వరంగల్ సిటిలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) & సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000-15000/- సంప్ర॥ 8688072125 [W-785490]

■ శ్రీ లక్ష్మీ హోంకేర్: HYDలో వృద్ధులకు పేషంట్లకు సేవ చేయుటకు బేబికేర్ ఇంటి /వంటపని స్త్రీ/పు కావలెను. జీతం: 16-18వేలు, రూం+ మీల్స్ ఫ్రీ. 9347148051 [G-550]

WANTED TEACHERS

■ Wanted Primary teachers to teach all subjects, walk in 9am - 12pm. WKPS, postal Colony, HNK. Cell: 8500596555, 9652529521. [WA-6953]

■ Experienced Teachers to Teach 6th to Inter and EAMCET. Maths, Physical Science, Biology, Oxford Tutorials & Spoken English. Cont: 6301134687. [W-785517]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గుండెపోటుతో వివాహిత మృతి



సృజన (ఫైల్)

నెల్లికుదురు: జపాన్ నుంచి వచ్చిన వారం రోజులకే గుండెపోటుకు గురై ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నముప్పారంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కదిర రాకేష్-సృజన (32) దంపతులు గత కొన్నేళ్లుగా జపాన్‌లో ఉద్యోగం చేసుకుంటూ స్థిరపడ్డారు. ఈ క్రమంలో సృజనకు కొన్ని నెలలుగా ఆరోగ్యం సహకరించడం లేదన్నారు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో వారం రోజుల క్రితం జపాన్ నుంచి వచ్చి వరంగల్‌లో తన బంధువుల ద్వారా రోహిణి ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి 5 ఏళ్ల కూతురు ఉంది.

అభియోగాలను ఖండిస్తున్నాం..

భూపాలపల్లి: కౌన్సిలర్లు చేసిన అభియోగాలను ఖండిస్తున్నామని భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, వైస్‌చైర్మన్ కొత్త హరిబాబు వెల్లడించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పీఏ వినోద్‌కు మంగళవారం రాత్రి వేర్వేరుగా లేఖలు అందజేశారు. ఇరువురి లేఖల్లో వివరాలు ఇలా ఉన్నాయి. కలెక్టర్ భవేష్ మిశ్రా, స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు డబుల్ బెడ్ రూం ఇళ్ల దరకాస్తులను ప్రతీ ఒక్క దానిని క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. తమపై కౌన్సిలర్లు మోపిన అభియోగాలను ఖండిస్తున్నట్లు తెలిపారు. «మీ ఆదేశాల మేరకు మీరు కల్పించిన పదవులకు రాజీనామా చేస్తాం» అని చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లు ఎమ్మెల్యే గండ్రకు లేఖ రాసి పీఏకు అప్పగించారు.